క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

మధురపూడి/రాజానగరం: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం జరుగనుంది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాజానగరం నియోజకవర్గంలోని వాడ వాడలా రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విగ్రహాలకు పూలమాలలు వేయడం, కేక్ కటింగ్‌లతో పాటు, పండ్లు, పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేయాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో చరిత్రలో చెరగని ముద్ర వేసిన రాజశేఖరరెడ్డిని కొనియాడుతూ ఘనంగా నివాళులు అర్పించాలన్నా రు. దీనిలో భాగంగా కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగారక్త దాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించండి

బిక్కవోలు: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించాలని మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మధురపూడి: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు కోరుకొండ మండలం దోసకాయలపల్లిల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు భీమడోలు కిరణ్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించవచ్చని మందా కృష్ణ రుజువు చేశారన్నారు. కుకూరి హరిబాబు, కత్తి సోమరాజు, పలి వెల ప్రసాద్, తాతపూడి చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రయాణికుడిని కాపాడిన ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్

రాజమహేంద్రవరం సిటీ: నడుస్తున్న రైలు ఎక్కబోతూ జారిపడబోతున్న ప్రయాణికుడిని కాపాడి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ చిరంజీవులు అధికారుల ప్రశంసలు అందుకున్నాడు. వివరాల్లోకి వెళితే శనివారం రాత్రి 17015 విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు రామచంద్రపురానికి చెందిన నంగి శ్రీను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్‌కు చేరే సమయానికి తాను ఎక్కాల్సిన రైలు కదులుతుండటంతో రైలు ఎక్కే ప్రయత్నం చేసిన శ్రీను రైలు నుంచి జారి పోతుండగా అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న చిరంజీవులు శ్రీనును రైలు కిందకు వెళ్లకుండా ప్లాట్‌ఫామ్‌పైకి లాగి ప్రాణాలు కాపాడ గలిగాడు. ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన చిరంజీవులను రైల్వేశాఖ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య మాట్లాడుతూ చిరంజీవులు సాహసానికి రైల్వే శాఖ అవార్డు ఇస్తుందని ఉన్నతాధికారులు తెలిపారన్నారు.

బూట్లు, పుస్తకాల పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక స్వరాజ్యనగర్‌లోని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలకు ఆదివారం గౌతమ్ అండ్ టీం ఆధ్వర్యంలో ఐఎఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బూట్లు, పుస్తకాలు, పెన్నులు ఇతర సామగ్రి అందించారు. ఈ సామగ్రిని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆళ్ల ఆనందరావు చేతులమీదుగా పలుకు నిర్వాహకురాలు ఘంటా కనకదుర్గ, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాకు చెందిన ఐఏఎస్ అకాడమీ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

నకిలీ పురుగు మందులతో జాగ్రత్త

- కొనుగోలు సమయంలో రశీదు తప్పనిసరి
- అన్నదాతలకు అధికారుల సూచన



రంగంపేట ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

రంగంపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ తరుణంలో పంట పొలాలకు ఎరువులు అధికంగా వినియోగిస్తారు. దీంతో మార్కెట్లలోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు, విజిలెన్స్ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండు సార్లు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు తీసుకోవాలని, లేదంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

దళారుల వద్ద వద్దు

ఎరువుల వ్యాపారులు పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులను రైతులకు అంటగట్టిన ఘటనలు కోకొల్లలు. అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయడం వల్ల వారి నుంచి ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తున్నారు కదా కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటోందని వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అన్న విషయాలను రైతులు తెలుసుకోవాలంటున్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన తరువాత తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నకిలీ ఎరువులని తెలిస్తే ఫిర్యాదు చేయండి

దుకాణాలు లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీని గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని, డీలర్‌తో సంతకాలతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించి సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా సత్వరం అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేస్తారు.

> **నిర్ధారణ తరువాతే కొనుగోలు చేయాలి**
>
> 
>
> రైతులు క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తరువాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేదంటే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే ఎక్కడైనా నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే ఆయా దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లులను అందజేయాలి.
>
> – కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి



సమావేశానికి హాజరైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు



అనపర్తిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అవమానిస్తే సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రభుత్వ అధికారులంతా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అవమానిస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ తరుపున ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేవలం అసెంబ్లీ, పార్లమెంటుకి చెందిన ఎన్నికలు మాత్రమే జరిగాయన్నారు. వీటిలో విజయం సాధించింది ఎమ్మెల్యేలు, ఎంపీలని అయితే అధికార కూటమి నాయకులు మాత్రం స్థానిక సంస్థల పరిపాలనకు కమిటీలు వేస్తున్నారంటూ దీనికి అధికారులు సహకరిస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పంచాయతీ పాలక మండలి సభ్యులు పదవీకాలం ఇంకా ఉందన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు కనీస సమాచారం లేకుండా ప్రభుత్వ పథకాలు అందించడం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అవమానించడమేనన్నారు. ఇటీవల పింఛన్ల పంపిణీ, ఐసీడీఎస్ ద్వారా జరిగిన గర్భిణులు, బాలింతలకు అందించే రేషన్ వంటి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా ఏ అర్హత లేని అధికార పార్టీ నాయకులతో పంపిణీ చేయించడం సరి కాదన్నారు. ఏ అర్హత లేని వారితో పథకాలు పంపిణీ చేయించి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అవమానించడం అధికార పార్టీకి, అధికారులకు మంచిది కాదన్నారు. ఈ ఘటనలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అయినా అధికారుల్లో మార్పు రాకపోతే దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటమి అనేది కేవలం తాత్కాలికమేనని, వచ్చే గెలుపునకు ఓటమి పునాది కావాలన్నారు. కార్యకర్తలు, నాయకులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, పలు గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులు, పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపులో డయేరియా కేసులు

పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో డయేరియా కేసులు అదుపులో ఉన్నాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకే చైతన్య ఆదివారం తెలిపారు. 16 డయేరియా కేసులు నమోదు కాగా, వాటిలో 10 మంది డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన ఇద్దరు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో, ఇద్దరు ప్రయివేట్ ఆసుపత్రిలోను, సీతానగరంలో పీహెచ్‌సీలో ఒకరు, ప్రయివేట్ ఆసుపత్రిలో ఒకరు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. రెండు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు వైద్య బృందాలు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరాలు ఉన్నాయా, వాంతులు, విరేచనాలు అవుతున్నాయా అన్నదానిపై సర్వే నిర్వహించి, మందులు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. డయేరియా ఉన్న ప్రాంతంలో ప్రతి రోజు ఇంటింటి సర్వే నిర్వహిస్తామని పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య వివరించారు. ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ డయేరియా ప్రాంతంలో పర్యటించి, వైద్య సిబ్బంది నిర్వహించే ఇంటింటి సర్వేను పరిశీలించారు. సీహెచ్‌వో పి.వెంకటరత్నం, ఎంపీహెచ్ఈవో వైఎస్‌రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, హెల్త్ అసిస్టెంట్లు సుంకర నగేష్‌బాబు, నందీశ్వరరావు, ఏఎన్ఎంలు మున్నీషా బేగం, సలీమా బేగం, ఆశా వర్కర్లు స్వరాజ్య లక్ష్మి, రవళి పాల్గొన్నారు.



సీతానగరంలో ఇంటింటి సర్వేలో వైద్యసిబ్బందితో కలసి మందులు అందిస్తున్న ఎంపీడీవో కృష్ణ ప్రసాద్

మాజీ మంత్రి వేణుకు పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను ఆదివారం వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. చెల్లుబోయిన వేణు తల్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏనాటికీ వైఎస్సార్‌ని మరువలేం

- ఆయనను జయంతి వేళ గుర్తు చేసుకుంటున్న జనం
- రాజానగరం నియోజకవర్గంతో మహానేతది విడదీయరాని బంధం



ఉచిత విద్యుత్‌తో మెట్టలో బోర్ల కింద సాగవుతున్న పొలాలు

రాజానగరం : రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించి రైతు బాంధవుడిగా కీర్తి పొందిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి రాజానగరం నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. సోమవారం ఆయన జయంతి సందర్భంగా ఆ మహానేత స్మృతులను జనం గుర్తు చేసుకుంటున్నారు. జిల్లాలో వైఎస్సార్ తన పాదయాత్రను కొనసాగిస్తూ రాజానగరంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఒక రాత్రి బస చేశారు. ఆ సమయంలో మెట్టప్రాంత రైతులు కొంతమంది ఆయనను కలిసి సాగునీటి కోసం తాము పడుతున్న అవస్థలను, కరెంటు బిల్లులు కట్టలేక పొలాలను సైతం అమ్ముకుంటున్న వైనాన్ని వివరించారు. వారి అవస్థలు విని చలించిపోయిన వైఎస్సార్ అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందించేలా సంబంధిత ఫైలుపై తొలి సంతకం చేశారు. ఇది ఈ ప్రాంత రైతులకు ఆయన ప్రసాదించిన వరంగానే అంతా పరిగణిస్తూ పార్టీల కతీతంగా వారి హృదయాల్లో ఆయన చెరగని ముద్రవేశారు.

ఎత్తిపోతలతో మెట్టకు మహర్దశ

అంతేకాక సాగునీటి సౌకర్యాలు సమృద్ధిగాలేని మెట్ట ప్రాంత భూములకు గోదావరి జాలాలను ఎత్తిపోతల పథకాల ద్వారా అందించి లక్షలాది ఎకరాలను సాగులోకి తీసుకు వచ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుంది. మెట్ట ప్రాంతంలోని 18 మండలాల్లో 1 లక్ష 86 వేల ఎకరాలకు సాగునీటిని అందించేలా పుష్కర ఎత్తిపోతల పథకాన్ని సుమారు రూ. 600 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. మరో రూ. 10 కోట్ల వ్యయంతో కాటవరం ఎత్తిపోతలను పూర్తి చేసి సుమారు మూడు వేల ఎకరాలను సాగులోకి తీసుకువచ్చారు. పుష్కర ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ నుంచి కలవచర్ల, గాదరాడ, నర్సాపురంల వద్ద సుమారు రూ.65 కోట్ల ఖర్చుతో మూడు లిఫ్టులు ఏర్పాటుచేసి, 12 వేల ఎకరాలు సాగులోకి తీసుకువచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే నాటికి ఉన్న చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి కూడా ఉచిత విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకుని రైతులపై ఉన్న విద్యుత్ భారాన్ని తొలగించారు. దీంతో 10 వేల ఎకరాలకు కూడా సాగునీటిని అందించలేక పోతున్న ఈ పథకాన్ని మరింతగా అభివృద్ధి పరచి 35 వేల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్న రైతు భాంధవుడు వైఎస్సార్ అని జనం కొనియాడుతున్నారు.

వచ్చేశాయ్.. వచ్చేశాయ్ జగన్నాథ రథచక్రాల్!



రథంపై కొలువైన శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలు



భక్త జన సందోహం మధ్య నగర వీధుల్లో సాగిన రథయాత్ర



యాత్రలో పాల్గొన్న రేవతి రమణ్ ప్రభుజీ తదితరులు

- స్వామి దర్శనంతో పులకించిన భక్తజనం
- శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర
- నగర వీధుల మీదుగా ఇస్కాన్‌కు చేరిక
- 56 రకాలతో స్వామి వారికి భోగ నైవేద్యం

సీటీఆర్ఐ: శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రల దర్శనంతో భక్తజనం పులకించిపోయింది. ఆదివారం శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర రాజమహేంద్రవరం నగర వీధులలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి రానివారికోసం స్వామి వారే స్వయంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ప్రత్యేకత. స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభమైంది. ఏటా పూరీలో జగన్నాథస్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా జరుగుతుంది. అదేవిధంగా జగన్నాథస్వామి కొలువై ఉన్న ఇస్కాన్ మందిరంలో కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. అయితే జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్టును ఊరేగించడం విశేషం. ఇస్కాన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ సెక్రటరీ రేవతి రమణ్ ప్రభుజీ ముఖ్య అతిథిగా పాల్గొని, రథయాత్ర ప్రారంభించారు. కీర్తనలు, భజనల నడుమ శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. గోరక్షణపేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్‌పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా రథయాత్ర ఇస్కాన్‌కు చేరడంతో ముగిసింది. కమిటీ సభ్యులు రవీంద్ర చైతన్య దాస్ మాట్లాడుతూ రథయాత్రను ఒక్కో ఏడాది ఒక్కొక్క ప్రాంతం మీదుగా నిర్వహిస్తున్నామని గత ఏడాది కంబాల చెరువు నుంచి ప్రారంభించగా ఈసారి శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభించామన్నారు. రథయాత్ర ముగిశాక జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56 రకాలతో భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం ప్రసాద వితరణ జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి



సీతానగరంలో స్థానికులతో మాట్లాడుతున్న డీపీవో రాంబాబు

సీతానగరం: అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీపీవో కె.రాంబాబు హెచ్చరించారు. ఆదివారం సీతానగరంలోని డయేరియా ప్రబలిన ప్రాంతమైన సచివాలయం నుంచి లంకూరు వరకు డీపీవో రాంబాబు ఈవో పీఆర్డీ మూర్తి, పీహెచ్‌సీ డాక్టర్ ఏవికె చైతన్య, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత తదితరులతో కలిసి పర్యటించారు. డీపీవో రాంబాబు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి రోజు గ్రామంలో బ్లీచింగ్ చల్లాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పంచాయతీ వాటర్ ట్యాంక్‌ల నుంచి కాకుండా ట్యాంక్‌ల ద్వారా రక్షిత తాగునీటిని అందించాలన్నారు. వీధులలో ఉన్న చెత్త చెదారం డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అన్ని మందులూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి. అవినాష్, ఎంపీహెచ్‌వో వైఎస్ రాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



తొస్సిపూడిలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్ సీతారత్నం

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, కర్రి గౌరి, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనానికి నేడు శంకుస్థాపన

పెదపూడి: అనపర్తిలో 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.